లక్ష్యానికి దొరకని ఓటర్ల ఆధార్

- సత్తెనపల్లి డివిజన్‌లో మొత్తం ఓటర్లు 4,52,239
- ఇప్పటి వరకు ఆధార్ నమోదు ప్రక్రియ 80.74 శాతం పూర్తి
- డివిజన్‌లో సత్తెనపల్లి రూరల్ ప్రథమ స్థానం



ఫణిదంలో ఆధార్ అనుసంధానం కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్వోలు

సత్తెనపల్లి: ప్రభుత్వం ఓటర్ల జాబితా తప్పులు లేకుండా పారదర్శకంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకు ప్రతి ఓటరు ఆధార్ కార్డు (విశిష్ట గుర్తింపు కార్డు) సేకరణకు క్షేత్రస్థాయి సిబ్బంది వారి ఇళ్ల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆధార్ సంఖ్య సేకరణలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూ..లక్ష్యాలను సాధించ లేకున్నారు.

సత్తెనపల్లి డివిజన్‌లో మొత్తం 4,52,239 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 3,65,160 మంది ఓటర్లు ఆధార్ అనుసంధానం అయ్యారు. డివిజన్‌లో 80.74 శాతం ఈ ప్రక్రియ పూర్తయింది. ఇది సత్తెనపల్లి నియోజకవర్గంలో 81.64 శాతం కాగా పెదకూరపాడు నియోజకవర్గంలో 79.81 శాతంగా ఉంది. మండలాల వారీగా చూసుకుంటే.. సత్తెనపల్లి రూరల్ 86.24 శాతం పూర్తి చేసి ప్రథమస్థానంలో ఉండగా అత్యల్పంగా అమరావతి 75.60 శాతం అనుసంధానం అయ్యి చివరి స్థానంలో నిలిచింది. అధికారులు ఓ వైపు సమీక్షలు నిర్వహిస్తూ ఓటరుకార్డుతో.. ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని సూచిస్తుండగా ఈ ప్రక్రియ కొన్ని మండలాల్లో ముందుకు కదలడం లేదు.

సత్తెనపల్లి డివిజన్‌లో మండలాల వారీగా ఆధార్ నమోదు..

మండలం	మొత్తం	ఓటర్లు	ఆధార్ అనుసంధానం (శాతం)
సత్తెనపల్లి టౌన్	46,171	37,182	80.53
సత్తెనపల్లిరూరల్	58,691	50,615	86.24
ముప్పాళ్ళ	34,302	27,611	80.49
రాజుపాలెం	40,599	31,269	77.02
నకరికల్లు	50,921	41,664	81.82
పెదకూరపాడు	40,924	34,826	85.10
అమరావతి	57,876	43,755	75.60
అచ్చంపేట	49,557	38,028	76.74
క్రోసూరు	47,735	40,213	84.24
బెల్లంకొండ	25,463	19,997	78.53
మొత్తం	4,52,239	3,65,160	80.74

సేకరణలో తిప్పలు...

డివిజన్‌లో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల్లో ఒక పట్టణం, 9 మండలాలున్నాయి. ఓటర్ల జాబితా లోని ఓటర్ల ఆధార్ నంబరును సేకరించి నమోదు చేసే విషయంలో పోలింగ్ బూత్‌స్థాయి అధికారి (బీఎల్వో)తో పాటు క్షేత్రస్థాయిలో గ్రామ సచివాలయ సిబ్బంది కూడా భాగస్వాములవుతున్నారు. ఇందుకు గాను సిబ్బందికి గడువు విధించి, ఈ పనిని కేటాయించారు.

- ఓటర్ల ఇళ్ల వద్దకు బీఎల్వోలు వెళ్తున్నా.. కొందరు అందుబాటులో ఉండడం లేదు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో అలాంటి వారి ఆధార్ సేకరించడం కష్టతరమవుతోంది.
- ఎక్కువమంది గ్రామీణ ఓటర్లు పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. బీఎల్వోలు వారి సెల్ ఫోన్లకు కాల్ చేసి ఆధార్ సంఖ్యను తెలుసుకొని నమోదు చేస్తున్నారు.
- విద్య, ఉపాధి, వైద్యం తదితర కారణాల రీత్యా చాలా మంది పట్టణాలకు వలస వెళ్లినా.. తమ రేషన్, ఆధార్ వివరాలు మాత్రం అందుకు తగ్గట్టు మార్చుకోవడం లేదు.
- పట్టణంలోని ఓటర్లు అద్దె ఇళ్లల్లో ఉంటున్నందున ఇళ్లు మారినప్పుడు వారి చిరునామా కనుక్కోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తహసీల్దార్లు ఆధార్ సేకరణ విషయంలో అప్పుడప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ.. లక్ష్యాలను సాధించలేకున్నారు.

లక్ష్యసాధనకు కృషి



ఓటరు జాబితా తప్పులు లేకుండా తయారు చేయడానికి ఆధార్ సంఖ్య ప్రామాణికంగా తీసుకున్నారు. బీఎల్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఓటరు ఇంటికీ వెళ్తున్నారు. కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినందున కొంత ఇబ్బంది ఎదురవుతోంది. అలాంటి వారిని సెల్‌ఫోన్‌లో సంప్రదించి ఆధార్ సంఖ్యను నమోదు చేసుకుంటున్నాం. ఓటర్లు కూడా బాధ్యతగా తమ ఆధార్ సంఖ్యను తెలియజేస్తే కొంత వెసులు బాటు ఉంటుంది.

–కె.నగేష్, తహసీల్దార్, సత్తెనపల్లి

వ్యాసదేవాలయంలో సామూహిక అక్షరాభ్యాసం



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న భవఘ్నిగురూజీ



సామూహిక అక్షరాభ్యాసానికి హాజరైన భక్తులు

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రదమారామక్షేత్రమైన అమరావతి సమీపంలోని వైకుంఠపురం భగవాన్ శ్రీ వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో గురువారం శాస్త్రోక్తంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వ్యాసదేవుని ప్రతిష్ఠ అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా ద్విశత ప్రతిష్ఠాపనాచార్య బ్రహ్మశ్రీ శ్రీబాలాజీ గురుకుల్ పర్యవేక్షణలో భవఘ్నిఆరామ వ్యవస్థాపకులు శ్రీభవఘ్ని గురూజీ దంపతులు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాజ్ఞీకస్వాములు తొలుత విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, నవగ్రహ పూజ నిర్వహించారు. చిన్నారుల పలకలకు పూజలు నిర్వహించారు. అనంతరం భవఘ్నిగురూజీ దంపతుల చేతుల మీదుగా సరస్వతీ పూజ చేసి ఓం నమశివాయః అనే పంచాక్షరీ మంత్రాన్ని రెండు వందల మంది చిన్నారులతో తొలుత పసుపు కొమ్ములతో బియ్యంపైన, పలకలపైన రాయించారు. ఈ సందర్భంగా భవఘ్ని గురూజీ మాట్లాడుతూ విశ్వానికే ఆదిగురువు అయిన వేదవ్యాసదేవుని పవిత్ర దేవాలయంలో చిన్నారులకు నిర్వహించిన అక్షరాభ్యాసంతో వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పాల్గొన్నారు.

విజ్ఞానానికి పుస్తక పఠనం తప్పనిసరి



విశాలాంధ్ర సంచార పుస్తక వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రఘుపతి

సత్తెనపల్లి: విజ్ఞానం కోసం పుస్తక పఠనం తప్పనిసరి అని పట్టణ ఎస్‌ఐ ఎ.రఘుపతి పేర్కొన్నారు. పట్టణంలోని లూథరన్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన విశాలాంధ్ర సంచార పుస్తక వాహనాన్ని గురువారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు ముద్రిస్తున్న విశాలాంధ్రకు అభినందనలు తెలిపారు. విశాలాంధ్ర బుక్ హౌస్ ఇన్‌చార్జి కె.గురుప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు సంచార పుస్తకాలయం లూథరన్ చర్చి వద్ద పాఠకులకు అందుబాటులో ఉంటుందన్నారు. సీపీఐ నియోజకవర్గ బాధ్యుడు యిర్మీయా, వాహన బాధ్యులు వి.అజయ్ కుమార్, వై.సుధాకర్, సీపీఐ నాయకులు నరిశెట్టి వేణుగోపాల్, కంభాల శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కోటప్ప తిరునాళ్ల.. కొండంత ఆనందం



నరసరావుపేట: రాష్ట్ర పండగ కోటప్పకొండ తిరునాళ్లకు పట్టణం ముస్తాబైంది. పగలు ప్రత్యేక రంగులు, రాత్రిళ్లు రంగు రంగుల విద్యుత్ లైట్లతో ప్రధాన రహదారులు, ఫ్లై ఓవర్లు వెలిగిపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సుమారు రూ.51లక్షల పురపాలక నిధులతో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న శివునిబొమ్మ ఐలాండ్‌ను రంగులు వేసి పూలతో తీర్చిదిద్ది రాత్రిపూట ప్రత్యేకంగా కన్పించేలా డిజిటల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు శివుడి బొమ్మను దర్శించుకొని పూజలు చేస్తున్నారు. సెంట్రల్ డివైడర్లు, ఫ్లై ఓవర్లకు రంగులు వేశారు. వాటిపై రంగు రంగుల కాంతులతో ఇల్యూమినేషన్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 60మంది ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ప్రధాన రహదారులన్నింటిలో ఎటువంటి చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. సుదూర ప్రాంతాల నుంచి పట్టణం గుండా కోటప్పకొండకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నాలుగు చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు, ఎనిమిది ప్రదేశాల్లో తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణం నుంచి కొండకు వెళ్లే మార్గంతో పాటు అన్నీ ప్రధాన రహదారుల్లో ఉన్న వీధిలైట్లు, హైమాస్క్‌లైట్లలో వెలగని వాటిని గుర్తించి నూతన లైట్లను ఏర్పాటు చేశారు. ప్రభలు వెళ్లే మార్గంలో రోడ్లకిరువైపులా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి మార్గం క్లియర్ చేశారు. ఈ పనులు చేసేందుకు పురపాలకసంఘంలోని ఇంజనీరింగ్ విభాగం రూ.34లక్షలు వెచ్చిస్తుండగా, పారిశుద్ధ్య విభాగం రూ.17లక్షలు ఖర్చుచేస్తుంది.

15 టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసిన ఆర్టీసీ..

భక్తులు కోటప్పకొండకు వెళ్లి తిరిగి బస్సుల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు కావాల్సిన టికెట్లు ఇచ్చేందుకు 15 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి వెల్లడించారు. డిపో వద్ద ఐదు, కొండ కింద మూడు, కొండపైన రెండు, కొండ కింద చిలకలూరిపేట వైపు వెళ్లేందుకు మూడు, వినుకొండ, అద్దంకి వెళ్లేందుకు మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. టికెట్ చార్జీలు గతేడాది మాదిరిగానే ఉంటాయన్నారు. మొత్తం మీద 1300మంది అధికారులు, సిబ్బంది తిరునాళ్ల కోసం పనిచేస్తున్నారన్నారు.

సానుకూల దృక్పథంతో రుణాల మంజూరు

అమరావతి: యువతకు స్వయం ఉపాధి రుణాలను మంజూరు చేసేటప్పుడు బ్యాంకు మేనేజర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని నవోదయం కార్యక్రమ నోడల్ అధికారి సంజీవరావు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రుణాల మంజూరులో గ్యారెంటీతో పాటు వ్యక్తుల సామర్థ్యాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం కార్తిక్ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ విషయంలో క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ మాధురి, ఈవోపీఆర్డీ ప్రసాదరావు మండలంలోని అన్ని బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

కోటప్పకొండకు 120 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

చిలకలూరిపేటటౌన్: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని డిపో మేనేజర్ ఎస్ రాంబాబు చెప్పారు. కోటప్పకొండ వెళ్లే ప్రయాణికుల కోసం ఈ ఏడాది 120 బస్సులు ఏర్పాటు చేసినట్లు, ఇందుకు 800 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. గత ఏడాది తిరునాళ్ల సందర్భంగా 50వేల మందికి పైగా ప్రయాణికులను పేట డిపో నుంచి తరలించినట్లు, ఈ ఏడాది లక్ష మంది ప్రయాణికులు కోటప్పకొండకు వస్తారని అంచానా వేస్తున్నట్లు తెలిపారు. కోటప్పకొండకు వెళ్లటానికి పురుషోత్తమపటï్నం నుంచి పోతవరం, మద్దిరాల, యడవల్లి, యూటీ మీదగా, తిరిగి వచ్చే క్రమంలో కట్టుబడివారి పాలెం, చెరువురోడ్డు మీదుగా పట్టణానికి చేరుకొనేలా బస్సు రూట్లను నిర్దేశించినట్లు వివరించారు. ఆర్టీసీ బస్సులో ప్రయణించే వారిలో పెద్దలకు రూ. 30, పిల్లలకు రూ. 15గా టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

దంపతులకు గాయాలు

ఈపూరు: ఈపూరు గ్రామానికి చెందిన గోపాలుని భాస్కరరావు, భార్య శివపార్వతి ఇరువురు వినుకొండలోని ఓ ఆధ్యాత్మిక కార్యక్రమానికి బయలుదేరి ఆటోలో వెళ్తుండగా కొచ్చర్ల సమీపంలో ఆటో బోల్తా కొట్టడంతో శివపార్వతికి తీవ్రగాయాలు కాగా భాస్కరరావుకు స్వల్పగాయలయ్యాయి. ఇరువురు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఓం నమఃశివాయ..



నకరికల్లు: మునిశ్వరులచే ప్రతిష్ఠింపబడి, 3వ శతాబ్దం నాటి చరిత్ర కలిగిన మండలంలోని నర్సింగపాడు గ్రామంలో ఉన్న శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయం, అదే గ్రామంలోని శ్రీమరకత లింగేశ్వర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సుందరంగా తీర్చిదిద్దారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి కెక్కి శిబి చక్రవర్తి కాలంనాటి చరిత్ర కలిగి.. భక్తుల నీరాజనాలందుకుంటున్న చేజర్ల గ్రామంలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత శ్రీకపోతేశ్వరస్వామి ఆలయం వేడుకలకు సిద్ధమైంది. శివాలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయాల వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పర్వదినం నాడు జాగరణకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

పశుదాణామృతం పంపిణీ



మాదల(ముప్పాళ్ళ): పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందించే పశు దాణాను గురువారం పంపిణీ చేశారు. మాదల పశు వైద్యశాల పరిధిలో గ్రామాల పాడిరైతులకు పశు దాణామృతం అందించినట్లు పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి తెలిపారు. మొత్తం 25 మెట్రిక్ టన్నుల దాణా పంపిణీ చేయడం జరిగిందన్నారు. పశుదాణామృతం అసలు ధర కేజీ రూ.18 అయితే 75% రాయితీతో రైతుకు రూ.6.50ల చొప్పున అందించడం జరుగుతుందన్నారు. ఒక్కో రైతు1.8 టన్నులు తీసుకోవచ్చని తెలిపారు. కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రంలో గానీ, పశు వైద్యశాలలో సంప్రదించాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో ఉన్న శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరాలి



పెదకూరపాడు: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి పుట్టిన రోజు వేడుకలను మండలంలోని లింగంగుంట్ల హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజుపాలెం మండలం న్యూ బోధనం ఆర్ఆర్ సెంటర్ కు చెందిన కుంభ ముసలయ్య (43) ద్విచక్ర వాహనంపై సత్తనపల్లి వస్తున్నాడు. అదే సమయంలో రెంటపాళ్లలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

అమ్ముకోలేదు.. వండుకుంటున్నాం..



సత్తెనపల్లి: రేషన్ బియ్యం వంటకు వినియోగిస్తున్నామని, ఎవరికీ అమ్మడం లేదని పలువురు లబ్ధిదారులు స్పష్టం చేశారు. ఇంటింటికీ బియ్యం కొనుగోలు అంటూ ఓ పత్రికలో వచ్చిన వార్త కథనంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర సఫరాల అధికారులు, రెవెన్యూ సిబ్బంది సత్తెనపల్లి పట్టణంలోని 3, 8, 21 వార్డుల్లో కార్డుదారులను గురువారం విచారించారు. తాము రేషన్ బియ్యం సక్రమంగా ఎండీయూ వాహనం ద్వారా తీసుకుంటున్నామని, వాటిని వంట కోసం వినియోగిస్తున్నామని, ఎవరికీ విక్రయించడం లేదన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే 1902 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని కార్డుదారులకు సూచించారు.

పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలి



అమరావతి: ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించాలని క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన మండల వ్యవసాయశాఖ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పీఎం కిసాన్, ఈకేవైసీ గురించి రైతులకు అవగాహన కల్పించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎన్‌పీసీఐ లింక్, అధార్ అథంటికేషన్‌తో పాటు ఈ-క్రాప్ బుకింగ్ గురించి వివరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ అహ్మద్ వ్యవసాయసిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లి ఏఎంసీ ఛైర్మన్ బాబురావు



పెండెం బాబూరావు



కళ్ళం శివరామిరెడ్డి

సత్తెనపల్లి: సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, దళిత నాయకుడు, ఉమ్మడి ఏపీ కనీస వేతనాల బోర్డ్ మాజీ మెంబర్ పెండెం బాబు రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ గౌరవ ఛైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైస్ ఛైర్మన్‌గా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన కళ్ళం శివరామిరెడ్డి, డైరెక్టర్లుగా షేక్ మస్తాన్‌బీ (సత్తెనపల్లి), దుగ్గెంపూడి రఘురామిరెడ్డి (పెదమక్కెన), ఆళ్ల జగన్నాథం(నందిగామ), కామినేని వెంకటప్పయ్య(ధూళిపాళ్ల), గంగూరు విజయ లక్ష్మి(గుజ్జర్లపూడి), మారుబోయిన మల్లమ్మ (కంకణాలపల్లి), బత్తుల వెంకాయమ్మ (కుందురువారిపాలెం), మేడ సామ్రాజ్యం(చాగంటివారిపాలెం), ప్రత్తి అప్పారావు (గోళ్ళపాడు), గొరైపాటి ఉదూరయ్యా (రుద్రవరం), దేవరశెట్టి రవికుమార్ (సత్తెనపల్లి), బచ్చు వరలక్ష్మి (సత్తెనపల్లి), షేక్ జానమ్మ (సత్తెనపల్లి)తో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, మార్కెటింగ్ ఏడీ, వ్యవసాయ శాఖ ఏడీ, ముప్పాళ్ల పీఏసీఎస్ ప్రెసిడెంట్‌లను నియమించారు. ఈ సందర్భంగా పెండెం బాబురావు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చరిత్రలో దళిత సామాజిక వర్గానికి ఛైర్మన్‌గా అవకాశం రావడం ఇదే మొట్ట మొదటిసారి అన్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవతో పదవీ లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇది పేద వర్గాలకు దక్కిన గౌరవమని, నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందనడంలో ఈ నియామకం తార్కాణమన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అవకాశం కల్పించిన మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. బాబూరావు నియామకం పట్ల పలువురు నాయకులు, అధికారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

బీసీ జనభేరికి తరలిరండి



వాల్‌పోస్టర్లు అవిష్కరిస్తున్న నాయకులు

అమరావతి: ఈ నెల 22న మంగళగిరిలో నిర్వహించనున్న బీసీ జన భేరికి తరలిరావాలని రాష్ట్ర బీసీ సేన సహాయ కార్యదర్శి పరసా రంగనాథ్ గురువారం పిలుపు నిచ్చారు. స్థానిక జడ్పీ అతిథి గృహంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీసీ సోదరులు భారీగా తరలి రావాలని కోరారు. రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షుడు అర్.కృష్ణయ్య పిలుపు మేరకు ఏపీ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు శౌంరినాగరాజు ఆధ్వర్యంలో మంగళగిరిలో సాయంత్రం 5గంటలకు భారీ ర్యాలీ అనంతరం సమావేశం జరుగుతుందన్నారు. ఈ ఈ కార్యక్రమంలో అంధ్ర ప్రదేశ్ బీసీ సేన రాష్ట్ర నాయకులు కుంచాల కృష్ణ కిషోర్, మీనుగ అంజనేయులు, జిల్లా బీసీ సేన గౌరవాధ్యక్షుడు బంధంరావూరి శ్రీనివాసరావు, మండల నాయకుడు పీర్ సాహెబ్, మండల వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు అలా లక్ష్మీనారాయణ, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

అచ్చంపేట: చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు గోలి నాగకుమార్ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన కోసం ఈ నెల 22న మంగళగిరిలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగే బీసీ జనభేరి ర్యాలీ, సభకు బీసీలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం నాగకుమార్ బీసీ జనభేరి పోస్టర్స్ విడుదల చేశారు. కార్యక్రమంలో మండల బీసీ సేన అధ్యక్షుడు షేక్ జానీబాషా, స్టేట్ కో-ఆర్డినేటర్ పరస రంగనాథ, స్టేట్ ఆర్గనైజేషన్ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, సేట్ సెక్రటరీ కంబాల కిషోర్, బీసీ సంఘ మండల అధ్యక్షుడు సాతర్ల శ్రీనివాసరావు, ఉప ఎంపీపీ నాగరాజు, బీసీ నాయకులు షేక్ కమల్ సైదా షేక్ నాగులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: సీపీఎస్ రద్దు చేసి, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. 17 డిమాండ్స్ తో కూడిన ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఏపీటీఎఫ్ నాయకులు కార్యకర్తలు, ఉపాధ్యాయులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు మొమరాండం అందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ జోసెఫ్ కిరణ్ కుమార్, ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి ధర్మారావు, గౌరవాధ్యక్షుడు అమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శులు శ్రీలక్ష్మీ, తులసీ రమణి, అక్తరున్నీస, జిల్లా కౌన్సిలర్లు రవికుమార్, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, మారుతి రమేష్, జయరామిరెడ్డి, ఐ.వెంకటేశ్వర్లు, నేలటూరి రమేష్, మదన్ మోహన్, లక్ష్మీ నారాయణ, జిలాని, సైదా పాల్గొన్నారు.

రాజుపాలెం ఏఎంసీ ఛైర్‌పర్సన్ కొండ్రెడ్డి సుజాత



ఛైర్‌పర్సన్ కొండ్రెడ్డి సుజాత



వైస్ ఛైర్మన్ పూల ధనవంత్రి

రాజుపాలెం: రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కొండ్రెడ్డి సుజాతను, వైస్ ఛైర్మన్‌గా పూల ధనవంత్రి నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గౌరవ ఛైర్మన్ మంత్రి అంబటి రాంబాబు, కమిటీ డైరెక్టర్లుగా వేల్పుల లక్ష్మయ్య, నల్లగొర్ల తిరుపతమ్మ, బత్తుల నాగేంద్రమ్మ, దేవిరెడ్డి లక్ష్మీరెడ్డి, చికిలి మస్తాన్‌వలి, మూల ధనలక్ష్మీ, కూర్ల మల్లేశ్వరి, బెల్లంకొండ శివపార్వతి, లింగాల చిన్నమ్మాయి, మురికిపూడి చిన్న నాగేశ్వరరావు, మహబూబ్ కమల్ బాషా, కాండ్రు బిక్షమయ్య, నిమ్మకాయల వీరాంజనేయులును నియమించారు. నకరికల్లు సొసైటీ ఛైర్మన్, పల్నాడు జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారి, క్రోసూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, స్థానిక సర్పంచ్ పులిబండ్ల అశోక్‌ను కూడా డైరెక్టర్లుగా నియమించారు.

‘ప్రభ’వించిన వైభవం

భారీ విద్యుత్ ప్రభలకు గ్రామోత్సవం



ముస్తాబైన అమీన్‌సాహెబ్ పాలెం గ్రామ ప్రభ

నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామ భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమయ్యాయి. గత నెలరోజులుగా గ్రామస్తులు ప్రభల నిర్మాణంలో నిమగ్నమయ్యారు. గురువారం రెండు ప్రభలకు రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఒక్కో ప్రభ 90 అడుగుల ఎత్తుతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. 17వ తేదీన ఉదయం ప్రభలు శైవక్షేత్రం కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి సన్నిధికి బయలుదేరతాయి. 18వ తేదీ ఉదయం కల్లా కోటప్పకొండ వద్ద నిర్దేశిత ప్రాంతానికి చేరుకోనున్నాయి. పండుగ రోజు రాత్రి దేదీప్యమానంగా విద్యుత్ కాంతులతో ప్రభలు వెలిగిపోనున్నాయి. ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి, అనంతరం 19వ తేదిన ఉదయం తిరిగి స్వగ్రామాలకు బయలుదేరనున్నాయి. తిరిగి మరోసారి ప్రభలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న షిర్డీసాయిబాబా సేవాశ్రమం ఏడో వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు యావీ శివరామయ్య తెలిపారు. ఉదయం సుప్రభాత సేవలతో ప్రారంభమై సామూహిక సాయిసత్యవ్రతాలు, వార్షికోత్సవ కేక్ కటింగ్‌లు జరుగుతాయన్నారు.